ఈనాడు
అల్లూరి సీతారామరాజు
మంగళవారం 15 అక్టోబరు 2024

అరకులోయలో జాబ్‌మేళా 18న

అరకులోయ, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 18న అరకులోయలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిణి రోహిణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అరకులోయలోని ఆర్‌ఐటీఐలో ఈనెల 18న ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే జాబ్‌మేళాలో అపోలో ఫార్మసీ, నవత ట్రాన్స్‌పోర్ట్, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, భారత్ పే, ఇతర సంస్థల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. 18 నుంచి 30 ఏళ్లలోపు వయసున్న యువతీ యువకులు అర్హులని, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసి ఉండాలన్నారు. అభ్యర్థులు పాన్‌కార్డ్, ఆధార్‌కార్డు, విద్యార్హతల ధ్రువపత్రాలతో రావాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఉమానీలకంఠేశ్వరుని తాకిన సూర్యకిరణాలు

స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో మూలవిరాట్‌ను సోమవారం ఉదయం సూర్యకిరణాలు తాకాయని ఆలయ ప్రధానార్చకులు రామం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు స్వామివారి దర్శనానికి బారులుతీరారు.

– పాడేరు, న్యూస్‌టుడే

పారదర్శకంగా మద్యం దుకాణాల లాటరీ



లాటరీ తీస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, చిత్రంలో సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ మహేష్‌కుమార్ తదితరులు

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగిందని కలెక్టర్ ఏ.ఎస్. దినేష్‌కుమార్ తెలిపారు. సోమవారం పాడేరులోని వి.ఆర్. ఫంక్షన్ హాల్ వద్ద లాటరీ ప్రక్రియ కలెక్టర్, జేసీ అభిషేక్ గౌడ, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ మహేష్‌కుమార్, దరఖాస్తుదారుల సమక్షంలో నిర్వహించారు. మొత్తం 40 దుకాణాలకు 11,205 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎలాంటి గొడవలకు తావు లేకుండా మధ్యాహ్నం 12 గంటలకే ప్రక్రియ ముగిసింది. 9వ మద్యం దుకాణానికి గిరిజనేతరుడు దరఖాస్తు చేసుకోగా.. లాటరీలో అతని పేరు ఎంపికైంది. దీన్ని అధికారులు గుర్తించి వెంటనే ఆయనకు కాకుండా గిరిజన వ్యక్తికి కేటాయించారు. ఎంపికైనవారికి నిబంధనలు తెలియజేసి కొంత మొత్తం డిపాజిట్ చేయించారు. ఈనెల 16వ తేదీ నుంచి నూతన మద్యం పాలసీ అమలవుతుందని కలెక్టర్ తెలిపారు. సంయుక్త కలెక్టర్ ఎంజె అభిషేక్ గౌడ, ఏఎస్పీ, అసిస్టెంట్ కమిషనర్ మహేష్‌కుమార్, ఏఈఎస్ నాగరాహుల్ తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలోని లకవరపుపేట సర్పంచి వీరేంద్రప్రసాద్‌కు రెండు దుకాణాలు లభించాయి. ఆయనకు సీలేరు, చింతపల్లి-1 దుకాణాలు లాటరీలో దక్కాయి

డోలీలో మోసుకొచ్చినా నిలవని ప్రాణం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో డోలీమోతలు, సకాలంలో ఆసుపత్రికి వెళ్లలేని కారణంగా గిరిజనుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. మారేడుమిల్లి మండలం సున్నంపాడు పంచాయతీ నూరుపూడికి చెందిన కెచ్చెల తమ్మిరెడ్డి (35)కి సోమవారం ఉదయం తీవ్రమైన కడుపునొప్పి వచ్చింది. గ్రామానికి కనీసం అంబులెన్సు వచ్చే మార్గం లేకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో బంధువులు డోలీమోతతో బయల్దేరారు. నూరుపూడి నుంచి సున్నంపాడు సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉండటం, మధ్యలో పెద్ద కొండవాగులపై కనీసం కల్వర్టులు కూడా లేకపోవడంతో అతికష్టంపై సగం దూరం వరకు మోసుకొచ్చారు. అప్పటికే పరిస్థితి విషమించి తమ్మిరెడ్డి ప్రాణాలు విడిచాడు. ఇతనికి భార్య దుర్గమ్మ, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.



డోలీలో మోసుకొస్తున్న గిరిజనులు

మెరుగైన వసతులు.. మంచి ఫలితాలు!


ఆదర్శంగా ఆశ్రమ పాఠశాలలు

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే

ఒకప్పుడు గిరిజన ఆశ్రమాల్లో చదువుకునే విద్యార్థులకు బోధన సక్రమంగా ఉండేది కాదు. ఈ కారణంగా పరీక్షల్లో నెగ్గుకురాలేని పరిస్థితి ఉండేది. దీంతో ఆశ్రమాల్లో చదివించాలంటే తల్లిదండ్రులకు వెనుకడుగు వేసేవారు. ఆర్థిక పరిస్థితులు అంతంతగా ఉన్నవారు తప్పని పరిస్థితుల్లో చదివించినా, అంతో ఇంతో ఉన్నవారు ప్రైవేటు బడుల వైపు మొగ్గు చూపేవారు. ఇప్పుడీ పరిస్థితులు పూర్తిగా మారాయి. ప్రస్తుత ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ 2023-24 విద్యాసంవత్సరంలో సూపర్-50 ప్రాజెక్టు ప్రవేశపెట్టారు. పదో తరగతి చదివే ఐదువేల మందిలో బాగా చదువుకున్న వారిని బాలురు, బాలికలు సరిసమానంగా ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేశారు. మొత్తం 50 మంది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా వారంతా మంచి మార్కులతో సత్తాచాటారు. గుత్తులపుట్టులో విద్యార్థిని ధారమణి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యధికంగా 585 మార్కులు సాధించి రికార్డు సృష్టించింది. ఈ ఒక్కరే కాకుండా సూపర్-50 ప్రత్యేక శిబిరంలో చదువుకున్న ఇతర విద్యార్థులకు 549, 547, 506 మార్కులు పొందారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో 2024-25 విద్యా సంవత్సరంలో సైతం సూపర్-50 ప్రత్యేక శిబిరాన్ని ఇప్పటికే గుత్తులపుట్టు, మోదాపల్లి గిరిజన ఆశ్రమాల్లో ప్రారంభించారు. గతంలో అనేక ఆశ్రమాల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఉండేది, ప్రస్తుతం కొరత లేకుండా సరిదిద్దారు.

● ఇంతవరకు ఆశ్రమాల్లో సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోయేవి. గడిచిన రెండేళ్లలో 117 ఆశ్రమాల్లో సుమారు 30 వేల మంది విద్యార్థులు మాత్రమే ప్రవేశాలు పొందారు. ఈ ఏడాది ఆశ్రమాల్లో సీట్లకు మంచి డిమాండు ఏర్పడింది. ప్రస్తుతం సుమారుగా 35 వేల వరకూ చదువుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఈ సంఖ్య మరింత పెరిగే సూచనలున్నాయి.

పాడేరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఆధ్వర్యంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఆదర్శనీయంగా తీర్చిదిద్దే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. వైకాపా పాలనలో ఉప ప్రణాళిక నిధులు దారి మళ్లించి వేలాది మంది గిరిజన విద్యార్థుల సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి మూడు నెలల్లోనే ఆశ్రమాల రూపురేఖలు మార్చేందుకు నడుం బిగించింది. నాణ్యమైన మెనూ అమలుతోపాటు ఆరోగ్య పరిరక్షణ, ఉత్తమ బోధనపై ప్రత్యేక దృష్టి సారించింది.



ఆరోగ్యం, ఆహారంపై శ్రద్ధ



వైకాపా పాలనలో ఆశ్రమాలలో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం, ఆహారం పర్యవేక్షణను పూర్తిగా విస్మరించారు. ఫలితంగా ఏటా పదుల సంఖ్యలో విద్యార్థుల మరణాలు నమోదయ్యేవి. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి ప్రత్యేక చొరవతో ఆశ్రమాల్లో ఆరోగ్య సహాయకుల నియామకానికి కసరత్తు చేస్తున్నారు. పోషకాహారం అందించడంలో పీఓ అభిషేక్ ప్రత్యేక చొరవ తీసుకుని వంటనూనె సైతం నాణ్యమైనది వినియోగిస్తున్నారు. వారంలో రెండు పర్యాయాలు మాంసాహార భోజనంతోపాటు గుడ్డు, పాలు, ఇతర పదార్థాలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు.



గిరిజన ఆశ్రమంలో చదువుతున్న విద్యార్థులు

ప్రత్యేక దృష్టి సారించాం

గిరిజన ఆశ్రమాల్లో మౌలిక సదుపాయాలతోపాటు విద్యార్థుల చదువు, ఆహారం, ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఐటీడీఏ పీఓ సైతం ఆరోగ్యంపై ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఇదే సమయంలో సూపర్-50తో పదో తరగతిలో గతంలో ఎన్నడూ లేని ఫలితాలను అందుకున్నాం. ఇదే స్ఫూర్తితో ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించాం. గతం కంటే ఆశ్రమాల్లో చేర్పించేందుకు పిల్లల తల్లిదండ్రులు మొగ్గు చూపుతుండటం శుభపరిణామం.

– రజి, గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు, పాడేరు

వైద్యవిద్యకు అనుకూల ప్రాంతం పాడేరు

లాంఛనంగా ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభం

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు సురక్షిత ప్రాంతమని, భయాందోళనలు లేకుండా వైద్య విద్యార్థులు విద్యనభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. పాడేరు వైద్య కళాశాలలో సోమవారం నుంచి ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో సమావేశయ్యారు. ఈ ఏడాది రెండు విడతల్లో 42 మంది విద్యార్థులు ఇక్కడ ప్రవేశం పొందారు. వారితోపాటు తల్లిదండ్రులను కూడా కళాశాలకు ఆహ్వానించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ అధికారులు విశేష కృషి చేసి కళాశాలలో వివిధ విభాగాలను అందుబాటులోకి తీసుకొచ్చారని చెప్పారు. ప్రశాంతమైన వాతావరణంలో వైద్యవిద్యకు అనువైన ప్రాంతం పాడేరు అని పేర్కొన్నారు. చాలామంది దీనిని మారుమూల ప్రాంతం అనుకుంటున్నారని, కానీ రెండు గంటల్లో విశాఖపట్నం చేరుకొని ఎక్కడికైనా వెళ్లగలమని వివరించారు. సంయుక్త కలెక్టర్ ఎంజే అభిషేక్ గౌడ మాట్లాడుతూ.. తాను 2010లో వైద్యవిద్యను అభ్యసించానని గుర్తుచేసుకున్నారు. గుంటూరు జిల్లాకు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని కె.భావన మాట్లాడుతూ.. నీట్‌లో 594వ ర్యాంకు పొందానని చెప్పారు. పాడేరులో చేరడానికి తొలుత వెనుకడుగు వేశానని, కళాశాల ప్రిన్సిపల్, ఇతర విభాగాల అధిపతులు తనను ప్రోత్సహించారని తెలిపారు. ఇక్కడ ఇతర కళాశాలల కంటే మెరుగైన సౌకర్యాలు కల్పించారని చెప్పారు. ప్రిన్సిపల్ డాక్టర్ హేమలతాదేవి, జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకురాలు విశ్వమిత్ర, ఎన్.సి.సి వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ఏపీహెచ్ఎండీసీ అచ్చెన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

అభిజీత్ ఫెర్రో అల్లాయిస్ మూత!

★ రోడ్డున పడిన మూడు వేల మంది కార్మికులు ★ జగన్ బాదుడుతో కుదేలైన ఫెర్రో రంగం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఆర్థిక మండలిలోని అతిపెద్ద ఫెర్రో పరిశ్రమ మూతపడింది. జగన్ పాలనలో ఫెర్రో పరిశ్రమలకు విద్యుత్తు ఛార్జీల బాదుడు, భారీగా కోతలు, ట్రూ అప్ ఛార్జీలు పెంచడం, ఫెర్రో ఉత్పత్తులకు అంతర్జాతీయంగా ధరలు పతనం కావడం వెరసి సెజ్‌లోని అభిజీత్ ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమను సోమవారం మూసివేశారు.

అభిజీత్ పరిశ్రమ ఎనిమిది కొలిమిలతో రోజుకు 800 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఫెర్రో ఉత్పత్తులు చేసేది. వైకాపా ఐదేళ్ల పాలనలో ఈ పరిశ్రమకు ఎటువంటి రాయితీలు, విద్యుత్తు ప్రోత్సాహకాలు ఇవ్వకపోగా అప్పటి సర్కారు విద్యుత్తు బాదుడు కారణంగా ఈ పరిశ్రమ తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయింది. ధరలు పెరుగుతాయని, అంతర్జాతీయంగా మార్పు వస్తుందని, వేసవి అనుకూలంగా ఉంటుందని ఎదురు చూసినా ప్రయోజనం లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కంపెనీని మూసివేశారు. తెదేపా హయాంలో ఫెర్రో పరిశ్రమలకు యూనిట్‌కు రూ. 4.25 చొప్పున ఉండే విద్యుత్తు ఛార్జీలను జగన్ ప్రభుత్వం ఏకంగా రూ. 6.05కు పెంచింది. అప్పటి నుంచి ఈ పరిశ్రమ తేరుకోలేక పోయింది. అంతర్జాతీయంగా ఫెర్రో ఉత్పత్తుల ధర రూ. 1.55 లక్షల నుంచి ఏకంగా రూ.70 వేలకు పడిపోవడంతో ఏమిచేయాలో తెలియక కంపెనీకి తాళాలు వేశారు. ఫెర్రో మాంగనీస్ టన్ను తయారీకి రూ. 80 వేల నుంచి రూ. 90 వేల మధ్య ఖర్చు అవుతుండగా అంతర్జాతీయంగా దీని ధర రూ. 70 వేల లోపే ఉండడంతో నడపలేక యాజమాన్యం చేతులెత్తేసింది.



కంపెనీ ముందు కార్మికుల ఆందోళన

విద్యుత్తే కీలకం!: సెజ్‌లోని మిగిలిన పరిశ్రమలు అత్యవసర సమయంలో జనరేటర్లు ఉపయోగించి ఉత్పత్తులు కొనసాగించే అవకాశం ఉన్నా ఫెర్రో కంపెనీలకు అవకాశం లేదు. పరిశ్రమలో కొలిమి ఒక్కసారి ఆపితే మళ్లీ అది ప్రారంభం కావడానికి 48 గంటలకు పైగా సమయం పడుతుంది. విద్యుత్తే వీటికి ముడిసరుకు కావడంతో కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఫెర్రో కంపెనీలకు రాయితీపై విద్యుత్తును సరఫరా చేస్తున్నాయి. జగన్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి రాయితీ ఇవ్వకపోగా, విద్యుత్తు ఛార్జీలు పెంచడం పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపింది. అభిజీత్ కంపెనీలో మూడు వేల మంది వరకు కార్మికులు, ఉద్యోగులు పని చేస్తున్నారు. కంపెనీని అర్ధంతరంగా మూసివేయడంతో వీరంతా రోడ్డున పడ్డారు. కంపెనీ ప్రధాన ద్వారం వద్ద సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం ఆందోళనకు దిగారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

పల్లె పండుగలో ఎమ్మెల్యే శిరీషాదేవి

రంపచోడవరం, న్యూస్‌టుడే: గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పేర్కొన్నారు. రంపచోడవరం మండలం వాడపల్లి పంచాయతీ ఇసుకపట్ల గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ నెల 14 నుంచి వారం రోజుల పాటు పల్లె పండుగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో చెదల అబ్బాయిరెడ్డికి చెందిన పొలం అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుండం శ్రీనివాసుదొర, తెదేపా మండల అధ్యక్షుడు కారం సురేష్, మాజీ అధ్యక్షుడు అడబాల బాపిరాజు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పాపోలు శ్రీనివాసరావు, మాజీ సర్పంచి వై.నిరంజనీదేవి, ఎంపీటీసీ సభ్యురాలు మంగాయమ్మ, ఉపాధిహామీ ఏపీఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



భూమి అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

విద్యుత్తు సిబ్బంది అప్రమత్తం

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: అల్పపీడనం కారణంగా విద్యుత్తు సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు ఆ శాఖ జిల్లా పర్యవేక్షక ఇంజినీర్ జీవన్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరంతరం పనిచేసేలా కంట్రోల్ రూం సిద్ధం చేసినట్లు చెప్పారు. 94906 10026 నంబరుకు ఫోన్ చేసి సేవలు పొందవచ్చన్నారు. వర్షాల కారణంగా తెగిపడిన విద్యుత్తు తీగలు, కొమ్మలను ఎవ్వరూ తాకవద్దని సూచించారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు, న్యూస్‌టుడే: భోజన, వసతి సౌకర్యంతో ఉచితంగా మూడునెలలపాటు డీఎస్సీ శిక్షణ పొందేందుకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి జి.జనార్దన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం కలిస్తున్న ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 27న పరీక్ష నిర్వహించి, ఎంపికైన వారి జాబితా 30వ తేదీన ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 6వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు.

ఆట్యాపాట్యా.. తిరుగేలేదిక!

జిల్లాలో నర్సీపట్నానికి అగ్రస్థానం

తొలిసారిగా జాతీయ పోటీలకు ఇక్కడి బాలలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే

ఆట్యాపాట్యా.. ఆ ఆట గురించి కొద్దిమందికే తెలుసు. ఇందులో నర్సీపట్నం విద్యార్థులు మాత్రం మంచి ప్రతిభతో రాణిస్తున్నారు. ఏకంగా ఈ క్రీడలో వీరు జాతీయ పోటీల్లో పాల్గొని తమ ప్రత్యేకతను చాటుకున్నారు. ఈ క్రీడలో అనకాపల్లి జిల్లా నుంచి ఈ స్థాయికి చేరుకున్న తొలి బాలలుగా వీరు గుర్తింపు సొంతం చేసుకున్నారు. ఇందులో మరింత రాణించి క్రీడా కోటాలో ఉన్నతస్థాయి ఉద్యోగాన్ని సాధించాలనే లక్ష్యంతో వీరు మరింత సాధన చేస్తున్నారు.



ఒకప్పుడు ఉప్పు ఆటగా ఆట్యాపాట్యాగా గుర్తింపు ఉంది. ఖోఖో క్రీడ మాదిరిగా ఉండే ఇందులో పోల్స్ ఉండవు. నేలపై తొమ్మిది గళ్లు ఏర్పాటు చేసి ఆటగాళ్లు ఎవరిని తాకకుండా ముందుకు దూసుకుపోవాల్సి ఉంది. తొమ్మిది పాయింట్లు లభిస్తే విజేతగా నిలుస్తారు. ఇందులో ఎవరిని ఎవరు చేతితో తాకినా అవుట్ అవుతారు. ఏమాత్రం ఏమరుపాటు లేకుండా ఎవరి చేతికి అందకుండా పూర్తి ఏకాగ్రతతో చురుకుగా ఉండే వాళ్లకే విజయం వరిస్తుంది. జిల్లాలోని నర్సీపట్నానికి చెందిన కోచ్ డీసీహెచ్.అప్పారావు విద్యార్థులకు ఇందులో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. బాగా ప్రతిభ కనబరుస్తున్న వీరిలో కొందరు ఇప్పుడు జాతీయ పోటీల్లో పాల్గొని అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. గతంలో కర్నూలులోని రాష్ట్ర పోటీల్లో పరాజయం చవిచూసిన వీరు పట్టుదలతో ఇటీవల నెల్లూరులోని సబ్ జూనియర్స్ పోటీల్లో సత్తాచాటారు. బాలికల విభాగానికి ద్వితీయ స్థానం, బాలురకు తృతీయ స్థానం దక్కింది. వీరిలోనూ మంచి ప్రతిభ కనబరిచిన మధు, మధుప్రియ, ఓంప్రియవర్షిణి జాతీయ పోటీల్లో పాల్గొన్నారు.

చాలా ఆనందంగా ఉంది



మాది నర్సీపట్నం మండలంలోని గుర్రందొరపాలెం. నాన్న నూకరాజు తాపీ మేస్త్రి, అమ్మ అమ్మాజీ గృహిణి. చిన్నప్పటి నుంచి కబడ్డీ అంటే ఇష్టం. బడిలో నేర్పిస్తున్న ఆట్యాపాట్యా ఆకట్టుకుంది. కోచ్ ప్రోత్సాహంతో ఇందులో రాణించి జాతీయ పోటీల్లో పాల్గొనగలిగా. ఇదంతా చాలా ఆనందంగా ఉంది. కర్నూలులో జరిగిన రాష్ట్ర పోటీల్లో ఓటమి పాలైనా కుంగిపోలేదు. తర్వాత తృతీయ స్థానం సాధించడంతో జాతీయ పోటీల్లో అడుగు పెట్టగలిగా. ఈ పోటీల్లోనూ పతకం సాధించాలన్నది తన లక్ష్యం. క్రీడా కోటాలో వ్యాయామ ఉపాధ్యాయుడిని కావాలన్నది జీవిత ఆశయం – నంబారు మధు, తొమ్మిదో తరగతి

అందరూ గుర్తిస్తున్నారు...



కొయ్యూరు మండలంలోని మూలపేట మా ఊరు. బడి బస్సులో స్కూలుకు వస్తుంటాను. నాన్న రమణబాబు కారు డ్రైవర్. అమ్మ ప్రభుత్వ ఉపాధ్యాయిని. ఈ క్రీడ గురించి అందరూ తొలుత వ్యంగ్యంగా మాట్లాడారు. ఇప్పుడు జాతీయ పోటీలకు వెళ్లిన నన్ను చూసి ఈ ఆటను అందరూ గుర్తిస్తున్నారు. కోచ్‌కు తోడు వాలీబాల్ క్రీడాకారుడైన నాన్న ప్రోత్సాహంతో ఇందులో రాణిస్తున్నా. నెల్లూరులో జరిగిన పోటీల్లో ద్వితీయ స్థానం సాధించాను. ఎప్పటికైనా ఇందులో మంచి ప్రతిభ కనబరిచి దాని ద్వారా మంచి ఉద్యోగంతో జీవితంలో స్థిరపడాలన్నది లక్ష్యం.

– కోన మధుప్రియ, ఎనిమిదో తరగతి

ఇప్పుడు ముందుకు వస్తున్నారు..



మాది నర్సీపట్నం మండలంలోని గబ్బాడ. తల్లిదండ్రులు మణికుమారి, సత్తిబాబు వ్యవసాయదారులు. ఈ ఆట గురించి మొదట ఏమీ తెలిసేదికాదు. చరవాణిలో చూసి తెలుసుకున్నాను. స్కూల్‌లోనూ దీనిని నేర్పడంతో ఆటలో చేరాను. బాగా ఆడడంతో కోచ్, ఉపాధ్యాయులు ప్రోత్సహించారు. పుదుచ్చేరి జాతీయ పోటీల్లో పాల్గొనడం ఎన్నిటికీ మరిచిపోలేను. ఈ స్థాయికి వెళ్లడం చూసి మిగతా విద్యార్థులు సైతం ఇప్పుడు ఇందులో పాల్గొంటున్నారు. మరిన్ని పతకాలు సాధించి ఎప్పటికైనా ఐపీఎస్ కావాలన్నది ఆశయం.

– ఎం. ఓంప్రియవర్షిణి, పదో తరగతి

నర్సీపట్నంలోనే రాష్ట్రపోటీలకు ప్రతిపాదన



2002 సంవత్సరంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ నుంచి ఈ ఆటకు గుర్తింపు లభించింది. ఉద్యోగాలు దక్కించుకోవడానికి ఇది దోహదపడుతుంది. ఆట్యాపాట్యా రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో పోటీలు చేపడుతుంటారు. విశాఖ సంఘం పర్యవేక్షణలో ఉమ్మడి విశాఖ జిల్లాల్లో పాఠశాలల కోచ్‌లు విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. నర్సీపట్నం పిల్లలు ఇప్పుడు ఈ ఆటకు మంచి పేరు తెస్తున్నారు. ఆ ప్రాంతంలోని వారందరిని మరింత ప్రోత్సహించేందుకు నర్సీపట్నంలోనే రాష్ట్ర స్థాయి పోటీలు చేపట్టాలని భావిస్తున్నాం. – సింహాద్రి గోపీకృష్ణ, ఆట్యాపాట్యా సంఘం ప్రధాన కార్యదర్శి, విశాఖపట్నం

పేదలకు అందని కందిపప్పు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతంలో రాయితీపై కందిపప్పు సరఫరా నిలిచిపోయింది. బహిరంగ మార్కెట్‌లో కేజీ కందిపప్పు రూ.180 నుంచి రూ. 190 వరకు ఉంది. గిరిజన సహకార సంస్థ డీఆర్ డిపోల ద్వారా తెలుపు, అంత్యోదయ రేషన్‌కార్డులు ఉన్న లబ్ధిదారులకు రాయితీపై కందిపప్పు పంపిణీ చేయాల్సి ఉంది. పౌరసరఫరాల శాఖ నుంచి సరకు రాకపోవడంతో డీఆర్ డిపోల్లో అందించలేదు. ముంచంగిపుట్టు మండలంలోని 15,300 రేషన్‌కార్డులు ఉన్నాయి. ప్రతి కార్డుదారునికి కేజీ కందిపప్పు రూ.64లకు అందించాల్సి ఉంది. ఉచిత బియ్యం, రాయితీపై పంచదార పంపిణీ చేసిన అధికారులు కందిపప్పు సరఫరాను విస్మరించారు.

సిరులతల్లి తొలేళ్లు.. ఇంటింటా సంబరాలు

భక్తిశ్రద్ధలతో సాగిన ఘటాల పూజలు

నేటి మధ్యాహ్నం సిరిమానోత్సవం



హోం మంత్రి అనితకు చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారులు



పూజలు చేస్తున్న ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు, కుమార్తె అదితి

విజయనగరం, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు.. పూసపాటి వంశీయుల ఆడబిడ్డ.. పైడిమాంబ తొలేళ్ల సంబరం సోమవారం కనుల పండువగా సాగింది. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం 8 గంటల సమయంలో ఆలయ అనువంశిక ధర్మకర్త, గజపతుల వారసుడు పూసపాటి అశోక్ గజపతిరాజు కుటుంబ సభ్యులతో కలిసి దర్శనానికి వచ్చారు. వేదపండితులు రాజేష్, నాగేంద్రశర్మ, శివప్రసాద్, కృష్ణమూర్తి మంత్రోచ్చారణల నడుమ మాన్సాస్ కార్యనిర్వహణాధికారి ప్రసాద్, దేవస్థానం ఈవో ప్రసాదరావు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భగుడిలో తమ ఆడపడుచుకు పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వనంగుడికి వెళ్లి పట్టువస్త్రాలు సమర్పించి, పూజలు చేశారు. ప్రజలపై అమ్మవారి చల్లని దీవెనలుండాలని అశోక్ ఆకాంక్షించారు.

క్యూలైన్లన్నీ కిటకిట : తొలేళ్ల సందర్భంగా తల్లి దర్శనాలకు తెల్లవారుజామున 5 గంటల నుంచే భక్తులు తరలివచ్చారు. మహిళలు ఘటాలను సమర్పించారు. వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు అలరించాయి. హోం మంత్రి అనిత, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మేయర్ విజయలక్ష్మి, దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ రామచంద్రమోహన్, పండగ ముఖ్య అధికారి త్రినాథరావు, ద్వారకా తిరుమల దేవస్థానం ఈవో మూర్తి తదితరులు దర్శించారు. అర్ధరాత్రి పూజారి బంటుపల్లి వెంకటరావు రైతులకు విత్తనాలు అందజేసి, తొలేళ్ల క్రతువును ముగించారు.

అర్జీలపై క్షేత్రస్థాయిలో పరిశీలన

అనకాపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: అర్జీలు పరిష్కరించడంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా 151 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూకు సంబంధించి 99, పంచాయతీ రాజ్- 11, ఇతర శాఖలకు చెందినవి 41 ఉన్నాయి. వీటిని శాఖల వారీగా విభజించి సంబంధిత అధికారులకు పంపించారు. కలెక్టర్ విజయకృష్ణన్, డీఆర్వో బి.దయానిధి, ప్రత్యేక ఉప కలెక్టర్ సుబ్బలక్ష్మి, గృహనిర్మాణ పీడీ శ్రీనివాస్ అర్జీలు స్వీకరించారు. వీరి సమస్యలు ఉంటూ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్దిష్ట సమయంలో అర్జీలు పరిష్కరించాలన్నారు. అర్జీలను కింది స్థాయి అధికారులకు అప్పగించకుండా స్వయంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కరించాలన్నారు.



వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

★ రొంగలివానిపాలెంలో అనధికార క్వారీలు నిలుపుదల చేయాలని పలువురు గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్వారీల్లో పేలుళ్ల భయాందోళన కలిగిస్తున్నాయని, కొత్తగా క్వారీలు ప్రారంభానికి అనుమతులు ఇవ్వవద్దని కోరారు.


★ అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో తెలుగు సబ్జెక్టును పునరుద్ధరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగులేని కళాశాలగా మార్చడం దుర్మార్గమన్నారు. విద్యార్థులకు మాతృభాషను దూరం చేయడం తగదన్నారు. తక్షణమే తెలుగు సబ్జెక్టును పునరుద్ధరించాలని, లేని పక్షంలో విద్యార్థులతో ఆందోళన చేస్తామన్నారు.



★ భర్త రొంగలి వెంకటరమణ 2009లో అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి వితంతు పింఛను మంజూరు చేయాలని అధికారులు చుట్టూ తిరుగుతున్న పట్టించుకోవడం లేదు. ఆర్థికంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నాను. పలుమార్లు పింఛను కోసం దరఖాస్తు చేసుకున్న పట్టించుకోలేదని రొంగలివానిపాలేనికి చెందిన **రొంగలి దేముడమ్మ** ఆవేదన వ్యక్తం చేశారు.

మారుజాతి కలప పట్టివేత

దేవీపట్నం, న్యూస్‌టుడే: ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్న మారుజాతి కలపను అటవీ శాఖ అధికారులు సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నామని ఇందుకూరు రేంజ్ అధికారి కొండలరావు తెలిపారు. ఇందుకూరు సమీపంలో తనిఖీలు చేపట్టి ఎనిమిది టన్నుల వేప కలపను పట్టుకున్నామని చెప్పారు. వాటి విలువ రూ. 25 వేలు ఉంటుందన్నారు. కలపను రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు. ఏజెన్సీ నుంచి మారు జాతి కలపను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఇందుకూరు వద్ద స్వాధీనం చేసుకున్న కలప

ఖాదరీబాబా ఉరుసు ఆరంభం

కశింకోట, న్యూస్‌టుడే: హిందూ, ముస్లిం సామరస్యానికి ప్రతీకగా నిలిచిన అబ్దుల్ అజీజ్ షా ఖాదరీబాబా 77వ ఉరుసు సోమవారం ప్రారంభమైంది. మూడు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవానికి జిల్లా నలుమూలల నుంచి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి హిందూ, ముస్లిం భక్తులు ఖాదరీబాబా సమాధిని దర్శించి ప్రార్థనలు చేశారు. తొలి రోజు గ్యార్‌షరీఫ్‌తో ఉరుసు ప్రారంభమైంది. ఉదయం 6 గంటల నుంచి ఆరాధన కార్యక్రమాలు ఆరంభమయ్యాయి.



ఖాదరీబాబా సమాధిని దర్శించుకున్న భక్తులు

సున్నం తక్కువైతే మెత్తగా.. ఎక్కువైతే నల్లగా..

అనకాపల్లి, న్యూస్‌టుడే: చెరకు రైతులు బెల్లం తయారీకి శ్రీకారం చుడుతున్నారు. నాణ్యమైన బెల్లం తయారీకి తీసుకోవాల్సిన జాగ్రత్తలను అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పీవీకే జగన్నాథరావు సూచిస్తున్నారు. బాగా పక్వానికి వచ్చిన చెరకు నుంచే బెల్లం తయారు చేయాలి. స్వల్పకాలిక రకాలు 10 నెలలు, మధ్య, దీర్ఘకాలిక రకాలు 11 నెలలకు పక్వానికొస్తాయి. చెరకు మొదళ్లలో చక్కెర పాళ్లు ఎక్కువగా ఉంటాయి. చెరకును ముచ్చు మొదలు వరకు నరకాలి. లేకపోతే రస నాణ్యత ఆర శాతం వరకు తగ్గిపోతుంది. చెరకు నరికిన వెంటనే గానుగాడాలి. ఆలస్యమైతే దిగుబడి, రస నాణ్యత తగ్గుతుంది.

▼ తగినంత రవ్వకట్టు, లేత బంగారు రంగు ఉండి పంచదార శాతం 80 కంటే ఎక్కువగా ఉండాలి. బెల్లంలో తేమ శాతం ఆరు కంటే తక్కువగా ఉండాలి. రసాన్ని శుభ్రపరిచేందుకు, మలినాలను తొలగించేందుకు తగినంత సున్నం కలపాలి. సున్నం తక్కువ వేస్తే బెల్లం మెత్తగా.. ఎక్కువైతే నల్లగా మారుతుంది. సాధారణంగా 300 కేజీల చెరకు రసానికి 110 నుంచి 225 గ్రాముల వరకే సున్నపు ముద్ద కలపాలి. పక్వ దశకు ముందు,



బాగా అలస్యమైన తోటల నుంచి బెల్లం తయారు చేసే సమయంలో ఆఖరులో మూడు నుంచి ఐదు కేజీల పంచదార కలుపుకోవాలి. తద్వారా పంచదార బరువుకు సమానంగా బెల్లం నాణ్యత బాగుంటుంది.

▼ రంగు రావడానికి సోడియం హైడ్రోజన్ సల్ఫైట్‌ను ఎక్కువగా వాడొద్దు. క్వింటాల్ బెల్లంలో సల్ఫర్ డయాక్సైడ్ ఏడు గ్రాముల కంటే ఎక్కువ ఉండకూడదు. రైతులు 40 నుంచి 50 గ్రాముల వరకు వాడుతున్నారు. దీని బదులు సున్నపు సుక్రేట్/ మునగాకు రసం వాడాలి. పాకం పొంగి పొర్లుతున్నట్లు అనిపిస్తే నువ్వుల నూనె చిలకరించాలి. పెనాన్ని దింపే ముందు మంటను తగ్గించి చిక్కబడిన రసం ఆరకుండా తెడ్డుతో బాగా కలపాలి.

పాయకరావుపేట, న్యూస్‌టుడే: వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే మార్కెట్‌లో డిమాండు ఉన్న పంటలను ఎంచుకోవాలి. మిగతా రైతులకు భిన్నంగా ముందడుగు వేస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు పాయకరావుపేట మండలం పాల్తేరు గ్రామానికి చెందిన రైతు వెన్నా శ్రీను. విరుల సాగుపై మక్కువతో బంతిని ఎంచుకుని పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

బంతి సాగు.. లాభాలు బాగు

సత్ఫలితాలు సాధిస్తున్న రైతు

చిన్నతనం నుంచి ఆయనకు వ్యవసాయంపై మక్కువ. పెట్టుబడి అధికంగా ఉన్నా.. ఆ స్థాయిలో ఆదాయం గడించవచ్చని గుర్తించారు. ఈ ప్రాంతంలో పువ్వుల సాగు చేపట్టే రైతులు తక్కువ. కడియపులంక నుంచి తుని, పాయకరావుపేట తదితర ప్రాంతాలకు పూలను తీసుకువస్తుంటారు. కొత్తూరులో భూమిని కౌలుకు తీసుకుని ఐదేళ్లుగా పూలసాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఎకరా విస్తీర్ణంలో బంతి సాగుకు బెంగళూరు నుంచి మొక్కలు తీసుకువచ్చారు. ఒక్కో మొక్క రూ.3కి కొనుగోలు చేశారు. ఎకరాకు పది వేల మొక్కలు నాటారు. ఆరంభంలో మొక్కలను జలగలు ఆశించి తినేయడంతో ఇబ్బందులు వచ్చాయి. వెనకడుగు వేయకుండా మరోసారి మొక్క నాటారు. సేంద్రియ విధానాలతో జలగల బెడద వదిలించారు. మొక్క ఏపుగా ఎదిగేందుకు ఎరువులతోపాటు పశువుల గెత్తం వాడారు. రూ.లక్ష పెట్టుబడి కాగా.. పూల దిగుబడులను మార్కెట్‌కు తరలిస్తున్నారు. కేజీ రూ.50 నుంచి రూ.70 చొప్పున విక్రయిస్తున్నారు.



దిగుబడి ఆశాజనకం..: ఎకరాకు మూడు టన్నులకుపైగా దిగుబడి వచ్చే ఆస్కారముంది. సంక్రాంతి వరకు డిమాండ్ ఉంటుంది. చామంతి, మల్లె సాగు చేపట్టనున్నా. పూల కోసం వ్యాపారులు తోట వద్దకు వస్తున్నారు. తద్వారా మార్కెటింగ్‌కు ఇబ్బందులు ఉండటం లేదు. ఒక సీజన్ కలిసి రాకపోయినా మరో సీజనులో లాభాలు వస్తున్నాయి.

– శ్రీను, రైతు



రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

వరి దిగుబడులపై పొడ తెగులు ప్రభావం

? నాలుగు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. పొట్ట దశలో వరి దుబ్బులపై మచ్చలు ఏర్పడుతున్నాయి. కొన్నిచోట్ల మొక్కలు ఎండిపోతున్నాయి.

– అప్పారావు, బయలు కించంగి

✔ పంట దుబ్బు చేసే సమయం, పొట్ట వచ్చే సమయంలో రైజోక్టినియా సొలానీ శిలీంద్రం ఆశిస్తుంది. దీన్ని పొడ తెగులు అంటారు. ఈ తెగులు వల్ల పంట దిగుబడులు తగ్గిపోతాయి. తాలు గింజలు ఏర్పడతాయి. వాతావరణంలో తేమ శాతం అధికంగా ఉండటం, మబ్బులతో కూడిన వర్షం వల్ల ఈ తెగులు సోకుతుంది. నివారణకు పొలంలో నీటిని తగ్గించాలి. మోతాదుకు మించి నత్రజని (యూరియా) వాడకూడదు. ప్రకృతి వ్యవసాయంలో అయితే ఆవు పేడ, మూత్రం, ఇంగువతో తయారు చేసిన కషాయం వినియోగించడం ద్వారా తెగులు ప్రభావాన్ని నియంత్రించవచ్చు.

? మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ఏం చేయాలి. **– రాంగోపాల్, ముల్లుమెట్ట**

✔ మొక్కజొన్న విత్తిన 30 - 40 రోజుల తర్వాత ఎమామెక్టిన్ బెంజోయేట్ మందు 5 శాతం లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



రైతుల ప్రశ్నలు, సందేహాలకు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సేద్యపు విభాగం శాస్త్రవేత్త **సందీప్‌నాయక్** సమాధానాలు ఇచ్చారు. **– న్యూస్‌టుడే, చింతపల్లి**

రైతేరాజు

రంగు, మధ్య రకం బెల్లం ధర తగ్గుముఖం

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి మార్కెట్‌లో గత వారం రోజులుగా రంగు, మధ్య రకం బెల్లం ధరలు భారీగా తగ్గాయి. నాసి రకం ధరలు పెరిగాయి. రంగులు వంద కేజీలకు రూ.320, మధ్య రకాలు రూ.315 తగ్గాయి. నాసి రకం రూ.140 పెరిగాయి.

రకం	గత వారం	ఈ వారం
రంగులు	4,960	4,640
మధ్య	4,220	3,905
నాసి	3,235	3,375

సాగులో సందేహాలా ఫోను చేయండి

అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏడీఆర్ **సీహెచ్ ముకుందరావు** సమాధానాలు ఇస్తారు. మంగళవారం ఉ: 9 నుంచి - సాయంత్రం 5 గంటల మధ్య **99081 50600** నంబరుకు ఫోన్ చేయవచ్చు.



గిరిజనుల సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్



గ్రీవెన్స్‌లో సమస్యలు వింటున్న ఐటీడీఏ పీవో సింహాచలం, సబ్‌కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం, న్యూస్‌టుడే: మన్యంలో గిరిజనుల సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతోనే ప్రతి సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, ఐటీడీఏ ఏపీవో జనరల్ డి.ఎన్.వి. రమణతో కలిసి గ్రీవెన్స్ నిర్వహించి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 54 దరఖాస్తులు అందజేశారు. మారేడుమిల్లి మండలం నూరుపూడి మీదుగా సున్నంపాడు గ్రామానికి మెటల్ రోడ్డు నిర్మించాలని గిరిజనులు నైని మల్లేశ్వరరెడ్డి, కత్తుల ధర్మారెడ్డి, కల్లి లచ్చిరెడ్డి తదితరులు కోరారు. రంపచోడవరం మండలం ఆకూరు నుంచి దేవీపట్నం మండలం బడిగుంట వరకు మెటల్‌రోడ్డు మంజూరు చేయాలని గిరిజనులు ముచ్చిక ప్రసాద్, వంజం దుర్గారావు, పొడియం సీతమ్మ తదితరులు విన్నవించారు. గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు విజయశాంతి, ప్రత్యేక ఉప కలెక్టర్ జాన్‌రాజు, పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు షరీఫ్, వెలుగు ఏపీడీ దేగలయ్య, గిరిజన సహకార సంస్థ డీఎం పార్వతీశ్వరరావు, డీఎల్‌డీఓ కోటేశ్వరరావు, ఐసీడీఎస్ సీడీపీఓ సంధ్యారాణి, పీహెచ్ఓ చిట్టిబాబు, డీఈ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్య శాఖకు బదలాయించండి

హెల్త్ సెక్రటరీల ధర్నా

కలెక్టరేట్, న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీలను పూర్తిస్థాయిలో వైద్య ఆరోగ్య శాఖలోకి తీసుకురావాలని కలెక్టరేట్ వద్ద ఏపీ యునైటెడ్ గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆళ్ల దేవకి మాట్లాడుతూ హెల్త్ సెక్రటరీలు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, డీఎంహెచ్ఓల పరిధిలో పనిచేయడం వల్ల వీరికి ఒకే సమయంలో వేరువేరు పనుల అప్పగింతతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మూడేళ్లుగా సమస్య పరిష్కరించాలని కోరుతున్నా పట్టించుకోలేదన్నారు. పూర్తిస్థాయిలో వైద్య, ఆరోగ్య శాఖకు బదలాయించాలని, సీనియార్టీ జాబితా తయారు చేసి పదోన్నతులు కల్పించాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు మాట్లాడుతూ క్షేత్రస్థాయి సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్, డీఎంహెచ్ఓలకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు, అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రత్నం పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీలు

కాఫీ ధరలు పెంచుతూ అపెక్స్ కమిటీ నిర్ణయం

విశాఖపట్నం, న్యూస్‌టుడే : అంతర్జాతీయంగా కాఫీ ధరల్లో వచ్చిన మార్పులను దృష్టిలో పెట్టుకొని కొన్ని రకాల కాఫీ ధరలను పెంచుతూ బీచ్‌రోడ్డులోని గిరిజన సహకార సంస్థ (జి.సి.సి) ప్రధాన కార్యాలయంలో జరిగిన అపెక్స్ కమిటీ సోమవారం నిర్ణయం తీసుకుంది. ట్రైబుల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అరబికా పార్చ్‌మెంట్ కేజీ రూ.285, అరబికా చెర్రీ రకానికి చెందిన కాఫీ కేజీ రూ.150, రొబస్టా రకానికి చెందిన కాఫీ కేజీ రూ.80గా ధరలు నిర్ణయించామన్నారు. ఈ మేరకు రైతులకు చెల్లిస్తామన్నారు. గతంతో పోల్చితే పార్చ్‌మెంట్, చెర్రీల కాఫీ ధరలు కేజీపై రూ.5, రొబస్టాపై రూ.10 పెరిగాయని జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి తెలిపారు. గత ఏడాది 565 మెట్రిక్ టన్నుల కాఫీని గిరిజన రైతుల నుంచి సేకరించగా ఈ సంవత్సరం 2000 మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యం పెట్టుకున్నామన్నారు. సమావేశంలో పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్, కాఫీ బోర్డ్ ఆఫ్ ఇండియా బెంగళూరు డైరెక్టర్ డి.ఆర్.బాబురెడ్డి, అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ ఎస్.భార్గవి, తదితరులు పాల్గొన్నారు.



అపెక్స్ కమిటీలో జీసీసీ ఎండీ కల్పనాకుమారి, ఐటీడీఏ పీవో అభిషేక్, ఎమ్మెల్యే మత్స్యలింగం

16న జడ్పీ స్థాయీ కమిటీ సమావేశాలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్ (జడ్పీ) స్థాయీ కమిటీ సమావేశాలు ఈనెల 16న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర అధ్యక్షతన 1 నుంచి 7 వరకు కమిటీల సమావేశాలు జరుగుతాయన్నారు. సభ్యులు, అధికారులు ఉదయం 10గంటల కల్లా చేరుకోవాలని కోరారు.

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు గురుకుల విధానంలో శిక్షణ ఇవ్వడానికి సంస్థల నుంచి ఈనెల 21లోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా ఇన్‌ఛార్జి సాంఘిక సంక్షేమ శాఖ సాధికారత అధికారి కె.రాజేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో సాంఘిక, గిరిజన సంక్షేమశాఖలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా 50 : 50 విధానంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి నిర్ణయించాయన్నారు. దరఖాస్తు చేసుకునే సంస్థలు కనీసం రెండేళ్లపాటు డీఎస్సీ శిక్షణ ఇచ్చి ఉండాలన్నారు. గత డీఎస్సీలో కనీసం వంద మంది ఉద్యోగాలు పొందిన వారిపై, మూడేళ్ల సరాసరి టర్నోవర్ రూ. 40 లక్షలు ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న సంస్థల మరిన్ని వివరాలకు ఏపీ ఈ-ప్రొక్యూర్‌మెంట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీ

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఈనెల 16 నుంచి మూగజీవాలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న 3.42 లక్షలు ఉన్న జీవాలకు నట్టల నివారణకు ప్రభుత్వం రూ.8 లక్షలు మంజూరు చేసిందన్నారు. అన్ని మండలాలకు మందులు సరఫరా చేస్తామన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవలపై ఆరా

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాల్లో అందుతున్న వైద్య సేవలపై కేంద్రం బృందం పరిశీలన చేసింది. అచ్యుతాపురం, దుప్పితూరు గ్రామాల్లో డాక్టర్ జైత్రి నాయకత్వంలో ఈ బృందం సోమవారం పర్యటించింది. రక్తపోటు, క్యాన్సర్, మధుమేహంను ప్రాథమిక దశలోనే ఏ విధంగా గుర్తిస్తున్నారనే విషయాన్ని పరిశీలించారు. వైద్యసేవలు పొందుతున్న వారితో మాట్లాడి సేవలపై ఆరా తీశారు. ప్రజలకు ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించారు. వైద్యులు జయప్రశాంతి, కె.శ్రావ్య, సీహెచ్ఓ వేణుగోపాలరావు, రమణబాబు, సన్యాసిరావు, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

మునగపాక: చూచుకొండ ఆరోగ్య కేంద్రాన్ని, గణపర్తి ఉప కేంద్రాన్ని సోమవారం వైద్యశాఖ కేంద్ర బృందం సందర్శించింది. కేంద్ర బృంద సభ్యులు జైత్రి, ప్రశాంతి తదితరులు ఆరా తీశారు. వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మందుల కొరతపై ఆరా తీశారు. వైద్యాధికారిణి ఎస్తేర్‌రాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దేరు నీరు విడుదల

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: పెద్దేరు జలాశయ నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరిందని పర్యవేక్షణాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయన్న సమాచారంతో ఎప్పటికప్పుడు ఇన్‌ఫ్లోను గమనిస్తూ దిగువకు నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 214 క్యూసెక్కులు ఉండగా.. 120 క్యూసెక్కుల నీటిని కాలువలకు విడుదల చేస్తున్నామన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

గొలుగొండ, న్యూస్‌టుడే: వాహన చోదకులు రహదారి భద్రతపై తప్పనిసరిగా అవగాహన పెంపొందించుకోవాలని వెలుగు ఏపీఎం కరుణానిధి సూచించారు. మండల పరిషత్తు కార్యాలయంలో రహదారి భద్రతపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం, కారు నడిపే వారు సీటుబెల్టు తప్పక ధరించాలన్నారు. పోలీసు, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భవానీలకు త్రుటిలో తప్పిన పెనుముప్పు

నల్లజర్ల, న్యూస్‌టుడే : తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలంలోని అనంతపల్లి శివారులో జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున ప్రైవేటు టావెల్ బస్సు విభాగినిని ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 27 మంది భవానీ మాలధారులు సురక్షితంగా బయటపడ్డారు. అనకాపల్లి నుంచి విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న హైవే పోలీసులు వారందరిని వేరే బస్సులో విజయవాడకు పంపించారు.



నుజ్జయిన బస్సు ముందు భాగం



సురక్షితంగా బయటపడిన భవానీలు

బస్సు ఢీకొని ఆర్‌ఆర్‌పేట వాసి మృతి

కె.కోటపాడు, న్యూస్‌టుడే: గుల్లిపల్లి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చోడవరం మండలం రాయపురాజుపేటకు చెందిన పసుపులేటి ఈశ్వరరావు (45) మృతి చెందాడు. ద్విచక్ర వాహనంపై కె.కోటపాడు మండలం గొండుపాలెం వస్తుండగా మందుల కంపెనీకి చెందిన బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఈశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందాడని ఎస్సై ధనుంజయ చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దొండవాక తీరంలో నమూనాల సేకరణ

నక్కపల్లి, న్యూస్‌టుడే: దొండవాక తీరంలో చేపల మృత్యువాతపై అధికారుల బృందం సోమవారం పరిశీలించింది. దొండవాక, రాజయ్యపేట తీరాల్లో మృత్యువాత పడిన చేపలను డీఎఫ్ఓ ప్రసాద్, కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజినీర్ ముకుందరావు, ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్, డ్రగ్ విభాగం తదితర అధికారులు పరిశీలించారు. ఉప్పుటేరులో నీటి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ చేపల మృత్యువాతకు కారణాలను తెలుసుకోడానికి నమూనాలు తీసుకున్నట్లు చెప్పారు. పరీక్షల నివేదిక వస్తే కారణాలేంటనేది తెలుస్తాయన్నారు.



చేపలు, నీటి నమూనాలు సేకరిస్తున్న అధికారులు

ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఫిర్యాదు

కోటవురట్ల, న్యూస్‌టుడే : పందూరులో కొందరు ప్రభుత్వ భూములను ఆక్రమించారని ఈ గ్రామ సర్పంచి జగదీష్, భాస్కరావు, అప్పలకొండ తహసీల్దార్ తిరుమలబాబుకు సోమవారం ఫిర్యాదు చేశారు. కోటనందూరుకు ఒకరు తప్పుడు సర్వే నంబర్లను సృష్టించి అనుభవిస్తున్నారని, దీనిపై ఫిర్యాదు చేయగా, ఆ నాటి ఆర్డీఓ సూర్యారావు దీనిని రద్దు చేశారన్నారు. అదే భూమిని కారం పొడి తయారీ పరిశ్రమకు ఇచ్చారన్నారు. అయితే ఇప్పటి వరకు ఆ భూమిలో ఎటువంటి కట్టడాలు జరగలేదని, ఆ భూమిని స్వాధీనం చేసుకొని, గ్రామానికి చెందిన పేదలకు ఇప్పించాలని కోరారు. దీనిపై విచారణ చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	125	120
లైవ్	147	140
డ్రెస్‌డ్	213	250
స్కిన్‌లెస్	243	260

గంజాయి సాగుపై డ్రోన్‌తో నిఘా

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు సీఐ దీనబంధు ఆధ్వర్యంలో సోమవారం కించూరు, బడిమెల పంచాయతీ పరిధిలోని సప్పిపుట్టు, వల్లాయి, గొందూరు, సల్దిగెడ్డ గ్రామాల పరిసరాల ప్రాంతాల్లో గంజాయి సాగుపై డ్రోన్ కెమెరాలతో తనిఖీ చేపట్టారు. గంజాయి పండించినా, అమ్మినా, రవాణా చేసిన కఠిన చర్యలు తప్పవని ఆయా గ్రామాల ప్రజలను హెచ్చరించారు.


గంగవరంలో కారును తనిఖీ చేసున్న పోలీసులు

గంగవరం, న్యూస్‌టుడే: గంగవరం వై.జంక్షన్‌లో ఎస్సై డి.భూషణం ఆధ్వర్యంలో సిబ్బంది ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. మన్యం నుంచి మైదాన ప్రాంతాలకు వెళ్లే ప్రతి వాహనాన్ని పరిశీలించారు. గంజాయి రవాణా నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఏఎస్సై రజాక్, సిబ్బంది శ్రీను, కొండ, అబ్దుల్ అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగంగా మండలంలోని ప్రధాన కూడళ్లలో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నామని ఎస్సై పాపినాయుడు తెలిపారు. ప్రధాన రహదారుల్లోని కల్వర్టులు, వంతెనల వద్ద డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు. సోమవారం మండలంలోని పలు ప్రాంతాల్లో జల్లెడ పట్టారు. ప్రత్యేక బలగాలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బడులు పునఃప్రారంభం

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: దసరా సెలవుల అనంతరం అన్ని పాఠశాలలు సోమవారం


లగిశపల్లిలో విద్యార్థితో ఆంగ్లం చదివిస్తున్న ఎంఈవో-I సరస్వతిదేవి

నుంచి పునఃప్రారంభమయ్యాయి. జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమశాఖ డీడీ రజనిలతోపాటు మండల విద్యాశాఖాధికారులు సోమవారం ఉదయం పలు పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్యార్థుల హాజరు తక్కువగా ఉందని గుర్తించారు. పాడేరు మండల విద్యాశాఖాధికారులు విశ్వప్రసాద్, సరస్వతిదేవీ.. మండల పరిధిలోని పాఠశాలలను తనిఖీ చేశారు. ఎంఈవో-2 సరస్వతిదేవి సోమవారం ఉదయం లగిశపల్లి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూడో తరగతి విద్యార్థులకు ఆంగ్లం బోధించారు. హాజరు శాతం పెంచాలని ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావుకు సూచించారు. అనంతరం గురుపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు

వంతెన.. కలగానే మిగిలేనా?

మారేడుమిల్లి, న్యూస్‌టుడే

ప్రభుత్వాలు మారుతున్నా గిరిజనుల తలరాతలు మాత్రం మారడం లేదు. ఇప్పటికీ అనేక గిరిజన గ్రామాలకు కనీసం అంబులెన్సులు వెళ్లలేని దుర్భర పరిస్థితులు ఉన్నాయి. గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ప్రమాదకరమైన కొండవాగులు ఉండడం, వాటిపై కనీసం వంతెనలు, కల్వర్టులు లేకపోవడంతో గిరిజనులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వాగులు దాటాల్సి వస్తోంది.

మారేడుమిల్లి మండలం సున్నంపాడు నుంచి నూరుపూడి మీదుగా తాడేపల్లి, డి.వెలమలకోట, దొరచింతలపాలెం పంచాయతీలకు వెళ్లే రహదారి అంతర్రాష్ట్ర రహదారికి కూతవేటు దూరంలో ఉంది. ఈ గ్రామానికి కనీసం వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. తాడేపల్లి, డి.వెలమలకోట, దొరచింతలపాలెం పంచాయతీలు మండల కేంద్రానికి దూరంగా విసిరేసినట్లు ఉంటాయి. ఇక్కడి నుంచి మారేడుమిల్లికి రంపచోడవరం మీదుగా రావాల్సి ఉంది. ఇక్కడి ప్రజలు సుమారు 60 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో ప్రత్యామ్నాయంగా సున్నంపాడు నుంచి నూరుపూడి మీదుగా ఈ పంచాయతీలకు వెళ్లడానికి గతంలో ప్రభుత్వం రహదారి నిర్మించింది. దీని వల్ల సుమారు 40 కిలోమీటర్ల దూరం కలిసి రావడంతోపాటు, సమయం, డబ్బులు ఆదా అవుతాయి. ఈ మార్గంలో రెండు కొండవాగులు ఉండడంతో ప్రధాన అడ్డంకిగా మారింది. దీంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

శంకుస్థాపనలు చేసినా..

సున్నంపాడు నుంచి నూరుపూడి మధ్యలో ఉన్న వాగులపై వంతెనలు, కల్వర్టులు నిర్మించడానికి గతంలోనే శంకుస్థాపనలు చేసినా, ఇప్పటికీ వాటి నిర్మాణాలు మాత్రం పూర్తి కాలేదు. 2014-19 మధ్యలో తెదేపా ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి వంతెన, కల్వర్టుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2019లో వైకాపా అధికారంలోకి రావడంతో ఆయా వంతెనలు, కల్వర్టుల నిర్మాణాలకు మరోసారి అప్పటి ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు భూమిపూజ చేశారు. చిన్న వాగుపై కల్వర్టు పనులు కొంతమేర పూర్తి చేశారు. ఆ తర్వాత పనులు అసంపూర్తిగానే వదిలేశారు. ఈ మార్గంలో ప్రయాణించేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. సున్నంపాడు వద్ద ఉన్న పెద్ద వాగు వద్ద అసలు వంతెన నిర్మాణమే ప్రారంభం కాలేదు. వాహనాలు వెళ్లేందుకు ఆస్కారం లేకుండా పోయింది. కనీసం అంబులెన్సులు వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఎవరైనా ఆయా గ్రామాల్లో అనారోగ్యానికి గురైతే డోలీ కట్టి, వారిని సున్నంపాడు వరకు మోసుకుంటూ తీసుకురావాల్సి వస్తోంది. ఈ క్రమంలో తాజాగా నూరుపూడి గ్రామానికి చెందిన కెచ్చెల తమ్మిరెడ్డి (35) సోమవారం అనారోగ్యానికి గురై మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికైనా సంబంధిత ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, వంతెనలు, కల్వర్టులు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.


సున్నంపాడు- నూరుపూడి మధ్య ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వాగు (పాతచిత్రం)


వాగును తాడు సహాయంతో దాటుతున్న లైన్‌మెన్ (పాతచిత్రం)

ఎమ్మెల్యే ప్రజాదర్బార్ 19న

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లిలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఈనెల 19న ప్రజాదర్బారు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని ఎంపీడీవో వీరకిశోర్ తెలిపారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించి సోమవారం తెదేపా నాయకులతో కలిసి స్థలాన్ని పరిశీలించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. మండల తెదేపా అధ్యక్షుడు గురుకు శేషుకుమార్, నాయకులు బీశెట్టి అప్పాజీ, కర్రి సన్యాసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ ఏఈఈగా జయరాజు

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి ఆర్అండ్‌బీ ఏఈఈగా వి.జయరాజు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన భరతుడుకు సీలేరు బదిలీ అయ్యింది. ఆయన స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా నుంచి జయరాజును చింతపల్లి బదిలీ చేశారు.

గృహనిర్మాణ ఏఈగా నాగేశ్వరరావు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతగిరి మండలం గృహ నిర్మాణ ఏఈగా పెనుగొండ నాగేశ్వరరావు నియమితులయ్యారు. గతంలో ఈయన అనంతగిరి మండలంలో వర్క్ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. ఏఈగా పదోన్నతి పొందారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగుతో అదనపు లాభాలు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: వాణిజ్యపరంగా డ్రాగన్‌ఫ్రూట్ సాగుతో అదనపు లాభాలు సాధించవచ్చని జాతీయ ఉపాధిహామీ పథకం పీఎస్‌వో చల్లంగి రామ్‌ప్రసాద్ అన్నారు. రింతాడ, పెదవలస గ్రామాల్లో గిరిజన రైతులు ఉపాధిహామీ ద్వారా చేపడుతున్న చేపడుతున్న డ్రాగన్‌ఫ్రూట్ సాగును సోమవారం పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు బాలకృష్ణ, అరుణ్‌కుమార్, క్షేత్ర సహాయకులు రత్న తదితరులు పాల్గొన్నారు.

అ వీ ఇ వీ

వంతెనలు నిర్మించరూ..

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: పోతంగి పంచాయతీ శీలంగొంది, చంపాపట్టి, పెదపాడుకు ఆనుకుని ఉన్న గెడ్డల్లో వంతెనలు నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి పోతురాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. 2014 హుద్‌హుద్ తుపాను ప్రభావంతో చంపాపట్టి కాజ్‌వే కొట్టుకుపోయిందన్నారు. గత ప్రభుత్వం వంతెన నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించి చేతులు దులుపుకొందన్నారు. గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నాయకులు గుర్మిసింగ్, స్వామి పాల్గొన్నారు.

కిడారి జన్మదిన వేడుకలు

డుంబ్రిగుడ, అనంతగిరి గ్రామీణంన్యూస్‌టుడే: డుంబ్రిగుడలో తెదేపా మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు ఆధ్వర్యంలో మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేకు కట్ చేశారు. నేతలు నాగేశ్వరరావు, స్వామి, భాస్కరరావు, చిన గెన్ను, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు. అనంతగిరిలో తెదేపా మండల అధ్యక్షుడు అంటిపర్తి బుజ్జిబాబు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. నాయకులు బి.లక్ష్మణరావు, గాలి నరసింహమూర్తి, శివ, ఆనందరావు, మోస్యా, జోగులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రిన్సిపల్ మృతి



చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ రాజారావు(57) అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం తెల్లవారుజామున ఆయన స్వగ్రామం వేపగుంటలో ఒంట్లో నలత, జ్వరంగా ఉందని కుటుంబసభ్యులకు తెలపగా, వెంటనే వారు ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కళాశాల సిబ్బంది సంతాపం తెలిపారు.

బోనంగిపల్లిలో పిచ్చికుక్కల స్వైరవిహారం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: బోనంగిపల్లి గ్రామంలో పిచ్చికుక్కలు సోమవారం స్వైరవిహారం చేశాయి. పిచ్చికుక్కల దాడిలో గిరిజన బాలిక తీవ్రగాయాలపాలైంది. గ్రామంలో ఆడుకుంటున్న బాలిక కొర్ర సిరిమల్లిపై దాడి చేసి కరిచాయి. బాలికకు తీవ్ర గాయాలవగా.. స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

జల్‌జీవన్ మిషన్ నిధుల దుర్వినియోగం

చింతూరు, న్యూస్‌టుడే: అల్లిగూడెంలో తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి సీసం సురేశ్ డిమాండ్ చేశారు. అల్లిగూడెంలో సోమవారం శాఖా మహాసభ నిర్వహించారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులు అర్పించారు. జల్‌జీవన్ మిషన్ నిధులు దుర్వినియోగమయ్యాయని ఆరోపించారు. నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాస్, పల్లపు వెంకట్, పొడియం లక్ష్మణ్, కూర భీమయ్య, మడకం సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు

రంపచోడవరం: సారా తయారీ, విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై షేక్ సాదిక్ హెచ్చరించారు. సోమవారం గోగుమిల్లి, బందపల్లి తదితర గ్రామాల్లోని సారా బట్టీలపై విస్తృతంగా దాడులు చేపట్టారు. 400 లీటర్ల బెల్లం ఊట, సారాను స్వాధీనం చేసుకొన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొన్నామని ఎస్సై తెలిపారు.

గ్రామాల అభివృద్ధికే పల్లె పండుగ

కొయ్యూరు, జి.మాడుగుల, చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాలను అభివృద్ధి చేసేందుకే ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తోందని ఎంపీడీవో మేరీరోజ్ అన్నారు. మూలపేట పంచాయతీ రామాపురం గ్రామంలో సోమవారం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. రచ్చబండ నిర్మాణానికి స్థానిక సర్పంచి వెంకటలక్ష్మితో కలిసి భూమిపూజ చేశారు. చింతలపూడి పంచాయతీ గింజర్తిలో అభివృద్ధి పనులను తెదేపా మండల అధ్యక్షుడు జి.సత్యనారాయణ ప్రారంభించారు. నేతలు కె.రామ్మూర్తి, పి.సన్యాసిరావు కె.బాలరాజు, సంజీవరావు పాల్గొన్నారు. జి.మాడుగుల పంచాయతీ నేరోడివలస నుంచి కంబాలబయలు వరకు రూ.30 లక్షలతో బీటీ రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో తేజారత్నం, ఏఈ విజయ్‌కుమార్ పాల్గొన్నారు. అన్నవరం, బలపం, బెన్నవరం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సర్పంచులు పాంగి సన్యాసిరావు, బచ్చల సన్యాసమ్మ, రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: సమర్థవంతులైన పాలకులుంటే రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తుందని జడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీడీవో ఫణీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంపీపీ కారం లక్ష్మి, సర్పంచులు, సరోజిని, సంతోశ్, నర్సమ్మ పాల్గొన్నారు.

పాడేరు, గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: కిండంగి, కుజ్జెలి, వంజంగి, కాడేలి, లగిశపల్లి పంచాయతీల్లో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. తెదేపా పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధిలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రింతాడ, సంకాడ, వంచుల పంచాయతీల్లో జరిగిన కార్యక్రమాల్లో సర్పంచులు లక్ష్మి, నాగులమ్మ, కాసులమ్మ పాల్గొని మాట్లాడారు. ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోపీపీఆర్డీ పాపారావు, బాలరాజు, వీరవెంకట్ పాల్గొన్నారు.

అరకులోయ పట్టణం, అనంతగిరి గ్రామీణం, డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: పెదలబుడు, పద్మాపురంలో అభివృద్ధి పనులను సర్పంచులు దాసుబాబు, సుస్మిత, తెదేపా నాయకులు దొన్నుదొర ప్రారంభించారు. తొలిరోజు రూ.


తాడిగుడ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న దొన్నుదొర తదితరులు

37.75 లక్షల విలువైన పనులకు శంకుస్థాపన చేసినట్లు ఎంపీడీఓ లవరాజు తెలిపారు. అనంతగిరి నుంచి తాడిగుడ వరకు రోడ్డు నిర్మాణానికి ఎంపీడీవో ఏ.వి.వి కుమార్, సర్పంచి సోమెల రూతు ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి సియారి దొన్నుదొర, ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు పాల్గొన్నారు. అరుకు, కొర్రాయి, కురిడి పంచాయతీ కేంద్రాల్లో జరిగిన కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు, సర్పంచులు కొములు, శారద, లచ్చు, ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

గంగవరం, రాజవొమ్మంగి, మారేడుమిల్లి: గంగవరం, పాతగంగవరం తదితర గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ప్రత్యేకాధికారి సిద్దేశ్వరరావు, సర్పంచి కలుముల అక్కమ్మ, వైస్ ఎంపీపీ గంగాదేవి, మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, జనసేన మండలాధ్యక్షుడు కుంజం సిద్ధు తదితరులు పాల్గొన్నారు. రాజవొమ్మంగి మండలంలోని మారేడుబాక, వంచంగి, చికిలింత పంచాయతీల్లో సీసీ రహదారులు, మినీ అమృత్ సరోవర్ పనులకు శంకుస్థాపన చేసినట్లు ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తెలిపారు. సర్పంచి సూరిబాబు, కూటమి నాయకులు, ఏపీవో సురేష్‌కుమార్ పాల్గొన్నారు. తుర్రూరులో గోకులం నిర్మాణానికి ఎంపీడీవో వీరకిశోర్ భూమిపూజ చేశారు. ఏపీవో రెడ్డిబాబు, కార్యదర్శి శ్రీశబరి పాల్గొన్నారు.


నేరోడివలస, కంబాలబయలు రహదారి పనులు ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


తుర్రూరులో గోకులం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీడీవో వీరకిశోర్ తదితరులు

ఒప్పంద అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి


అధ్యాపకుల నిరసన

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని ఒప్పంద అధ్యాపకులు రత్నం, హరికృష్ణ, ఈశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం చింతపల్లి ప్రభుత్వ కళాశాల ఎదుట నిరసన తెలిపారు. జీవో నంబరు 114 ప్రకారం అందర్నీ రెగ్యులర్ చేయాలన్నారు. డిసెంబరు నాలుగో తేదీ వరకు పలు నిరసన కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించామని చెప్పారు. నాయుడు, మొదిలినాయడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


ప్రమాదానికి కారణమైన వాహనం

ఎటపాక, న్యూస్‌టుడే: గ్యాస్ బండలతో వెళుతున్న మినీ లారీ, ద్విచక్రవాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. గన్నవరం సమీపంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై కె.పార్థసారథి తెలిపిన వివరాల ప్రకారం.. హెచ్‌పీ గ్యాస్ బండలతో మినీ వ్యాన్ కూనవరం వెళ్తోంది. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం రుద్రంకోట గ్రామానికి చెందిన గాదే అనిల్ (37) కూనవరం వైపు నుంచి భద్రాచలం ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. గన్నవరం సమీపంలో రెండు వాహనాలు ఢీకొట్టడంతో అనిల్ రోడ్డుపై పడగా తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. అనిల్‌కు భార్య, ఇద్దరు చిన్న పిల్లలున్నారు.

బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపునకు కృషి

కొయ్యూరు, న్యూస్‌టుడే: బాలికల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు ప్రభుత్వం కిశోర వికాసం పథకాన్ని అమలు చేస్తోందని సీడీపీవో విజయకుమారి అన్నారు. సోమవారం మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో చింతపల్లిలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా 15 నుంచి 18 ఏళ్ల వయస్సు కలిగి, చదువు మధ్యలో మానేసిన బాలికలను గుర్తిస్తామన్నారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, ఆత్మవిశ్వాసం బలపడేలా శిక్షణ తరగతులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. డ్రాపవుట్ బాలికల పేర్లను అంగన్‌వాడీ కేంద్రాల వారీగా నమోదు చేయాలని కార్యకర్తలను ఆదేశించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీడీపీవో విజయకుమారి

జి.మాడుగుల, న్యూస్‌టుడే: జి.మాడుగుల గాంధీనగర్‌లో మూడో తరగతి చదువుతున్న గబ్బాడి మత్స్యకొండమ్మ అనారోగ్యంతో బాధపడుతూ గత ఏడాది నుంచి పాఠశాలకు దూరమైంది. అనారోగ్యం నుంచి కోలుకున్నట్లు వైద్యులు రవిచంద్రశేఖర్, శశికాంత్ నిర్ధారించి ఏటీడబ్ల్యూవో తిరుపాల్ దృష్టికి తీసుకెళ్లారు. వైద్యులు, ఏటీడబ్ల్యూవో సమక్షంలో విద్యార్థిని సోమవారం పాఠశాలలో చేర్పించారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: పంచాయతీ, సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు.. పంచాయతీల్లో పనులు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేను తప్పక నిర్వహించాలని సూచించారు. పల్లెపండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈవోపీఆర్డీ పాపారావు, కార్యదర్శులు పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని వినతి

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: ఏజెన్సీలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకురావాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణికి ఆదివాసీ గిరిజన సంఘం తరపున లేఖ రాసినట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అప్పలనర్స సోమవారం తెలిపారు. ఈ నెల 16వ తేదీన జరగనున్న కేబినెట్ సమావేశంలో ప్రత్యేక డీఎస్సీ ప్రకటిస్తూ నిర్ణయం తీసుకోవాలన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో పోస్టులన్నీ స్థానికులకే కేటాయించాలని కోరారు.

వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం హర్షణీయం

మారేడుమిల్లి, రంపచోడవరం, న్యూస్‌టుడే: రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం హర్షించదగ్గ విషయమని జిల్లా వాల్మీకి సంఘం అధ్యక్షుడు గొర్లె చిననారాయణరావు అన్నారు. మారేడుమిల్లిలో సోమవారం ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారని చెప్పారు. ఈనెల 17న వాల్మీకి జయంతిని ప్రతి గ్రామంలోనూ ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఉన్నతాధికారులు.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆదేశివ్వాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, న్యాయవాది చుక్కా సంతోష్‌కుమార్ కోరారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: పరిసరాలను శుభ్రం చేసుకుంటే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని సీఆర్పీఎఫ్ 198 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌కుమార్ అన్నారు. సోమవారం చింతపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రం, శిశుజనన నిరీక్షణ కేంద్రం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. సీఆర్పీఎఫ్ సిబ్బంది చెత్తను తొలగించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ శుభ్రత పాటించాలన్నారు. సీహెచ్‌సీ వైద్యులు సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ముంచంగిపుట్టు నాలుగురోడ్ల కూడలి వద్ద స్వచ్ఛభారత్ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ జవాన్లు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: పెదవలస ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీఆర్పీఎఫ్ జవాన్లు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. సీఆర్పీఎఫ్ 234 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ ఏకే నాయక్ ఆధ్వర్యంలో ఆసుపత్రి ఆవరణను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారిణి డా. పృథ్వీషా, సచివాలయ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఏఎన్ఎంల ఆందోళన


పాడేరుల కలెక్టరేట్ వద్ద గ్రామ సచివాలయ ఏఎన్ఎంలు

పాడేరు, న్యూస్‌టుడే: గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎం సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆ సంఘ నాయకులు జిల్లా సంయుక్త కలెక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. తమకు వైద్యారోగ్య శాఖలోనే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సచివాలయంలోనే ముఖ హాజరు నమోదు చేయాలనే నిబంధనలు తొలగించాలన్నారు. పదోన్నతులు కల్పించాలన్నారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సుందరరావు, ఏఎన్ఎంల సంఘం నాయకురాలు సుశీల, బేబీరాణి, కుమారి, భవాని, పూర్ణ, బుల్లమ్మ, పద్మ, మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం, న్యూస్‌టుడే:

?: స్థానిక ఐటీడీఏ సి-క్వార్టర్స్ వద్ద నుంచి ఎర్రంరెడ్డినగరం వరకు వర్షపు నీరు నిల్వ ఉండిపోతోంది. మురుగు కాలువలు నిర్మించాలి. –స్థానికులు, ఎర్రంరెడ్డినగరం

✓: స్థానిక ఐటీడీఏ సి-క్వార్టర్స్, ఎర్రంరెడ్డినగరంలో వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడతాం.

– సుండం శ్రీనివాసుదొర, ఎంపీడీవో, రంపచోడవరం

పెదబయలు, న్యూస్‌టుడే

?: పాడేరు నుంచి పెదబయలు మీదుగా ముంచంగిపుట్టు వరకు ఆర్అండ్‌బీ రహదారికిరువైపులా తుప్పలు పెరిగి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– నాగేశ్వరరావు, మంగబంద

✓: రహదారికిరువైపులా తుప్పలు తొలగించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

– వెంకటరావు, ఆర్అండ్‌బీ జేఈ, పాడేరు

వైద్యసేవలపై ఆరా

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులకు సక్రమంగా వైద్యం అందించాలని ఎంపీపీ కారం లక్ష్మి సూచించారు. రేఖపల్లి వైద్యశాలను సోమవారం ఆమె సందర్శించి రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఆ సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఉన్న అరకొర సిబ్బందితో మాట్లాడారు. వైద్యులు లేకపోతే రోగులకు ఎలా వైద్యం అందుతుందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మి తదితరులు

ఘనంగా దుర్గమ్మ అనుపోత్సవం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: సాయినగర్, రంగాసెంటర్ వద్దనున్న అమ్మవారి విగ్రహాలకు సోమవారం ఉదయం భక్తులు పూజలు నిర్వహించారు. స్థానిక రామాలయం, మైలుకూలివీధిల నుంచి మహిళలు అమ్మవారికి సారె తీసుకొచ్చారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. సాయంత్రం దుర్గమ్మను శక్తివేషాలు, కోలాటాలు, బాణసంచాతో పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం భీమసింగి ఏరులో నిమజ్జనం చేశారు. బేతాళుడు, సత్తిబాబు, దూనబోయిన రమణ, హంస, తాడి రమణ, చిన్న తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి సోమిరెడ్డిపాలెంలోని మాతృశ్రీ వనదుర్గమ్మ ఆలయం వద్ద సామూహిక అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాసగాన సూర్యకుమారి ఆర్థికసహాయంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగి మండలంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. కింద్రలో బతుకమ్మ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని బతుకమ్మ ఆడారు. వివిధ రకాల నైవేద్యాలు సమర్పించారు.

సీలేరు, న్యూస్‌టుడే: ధారకొండ పంచాయతీ కేంద్రంలో దేవీ శరవన్నవరాత్రి మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. అమ్మవారి అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన థింసా నృత్యాలు ఆకట్టుకున్నాయి.


చింతపల్లి ఊరేగింపులో శక్తి వేషాలు


ధారకొండలో మహిళల థింసా నృత్యం


కింద్రలో ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ